కథా నిలయం
5479
విశాఖపట్నం

# మలుపు

వరుసగ ఐదారేండ్ల సుండి వర్షాలు లేవు. మృగశిర కార్తెలో [illegible] వర్షానికి గడ్డి గాదం మొలిచినట్టె మొలిచి మలి కార్తెలో మాడిపోతున్నాయి, పారె నీరు లేక పంటలు లేవు. తాగే నీరు లేక అతిసార వ్యాధులు. భూస్వాములు వ్యవసాయం నడవక భూములు అమ్ముకొని పట్నం చేరి రక రకాల వ్యాపారాల్లో చేరిపోతున్నారు. అందుకే ఒక్క మాటలో చెప్పాలంటే ఉన్నవాడు వ్యాపారి లేనివాడు బికారి. ఈ పరిస్థితిలో పల్లెల్లోని రైతులు కూడ కూలి పనులకోసం వలసపోతున్నారు.

పొద్దంత పనికోసం తిరిగి తిరిగి ఏ పని దొరకక తిరుపతయ్య ఇంత గంజీనీళ్ళు తాగి పందిరికింద నులక మంచం వాల్చుకొని అడ్డం ఒరిగాడు. వాకిట్లోని రోలుమీద కొడుకు రాములు కూర్చొని వున్నాడు. తనను జీతం వుంచుకున్న పటేలు నీకు తెలుసు కదా తరిలోనే సాలుకు రెండు పంటలు పోయి ఒక పంట అయ్యింది. ఇప్పుడు ఆ ఒక్క పంటకు కూడా నీళ్ళు పారటం లేదు. వర్షాధారమైన మెట్టపంటల సంగతి చూస్తునే ఉన్నాము. పెట్టుబడులు పెరిగిపోయినయి. చెరువులు, దోనలు, బావులు అన్ని ఎండిపోయాయి. బోర్లల్లో నీరు అడుగంటి పోయింది. పంట దిగుబడి తగ్గిపోయింది. పండిన ఆ కొంత పంటకు గిట్టు బాటు ధరలు లేవు. పెట్టిన పెట్టుబడి తిరిగి రావట్లేదు. అసలు వ్యవసాయాన్ని మానుకునే రోజులు వస్తున్నాయి. నేను నీకు ఈ ఏడు ఏ అప్పు ఇవ్వలేను అగావు అసలు ఇవ్వలేను. ఉన్న అప్పును తీర్చి నీవు వేరే పని చూసుకో అన్న పటేలు మాటలు మరీ మరీ గుర్తుకు రాసాగాయి రాములుకు.

"అయ్యా నాగయ్య మామలాగే పట్నం పోదామా!" అన్నాడు కొడుకు

"మనం అక్కడ బతుకగలమా!"

"నాగయ్య మామ బతుకడం లేదా, ఈ ఊళ్ళో ఏముంది పట్నంలో పది పనులు, ఏ పని చేసుకొనైనా బతుకవచ్చు" అన్నాడు రాములు.

అప్పుడే చేతిలో చాపతో వచ్చిన రంగమ్మ "ఏ పని దొరకదు, ఎన్ని రోజులని ఇట్ల కూసుంటం, పని దొరక్క ఎన్నాల్లయ్యింది. పల్లెల పనే తీరిపోయింది" అంది చాపను కింద పరుస్తూ.

అంతకు ముందు చప్పట్ల ఆట ఆడుకోవడానికి బయటికి వెళ్ళిన సుశీల, ఆడుకోవటానికి తోటి వాళ్ళు ఎవరు రాంది చూసి తాను ఇంటికి తిరిగొచ్చి

చాపలో వొరుగుతూ జడలోని గడ్డిపూలను తీసి పందిరి గుంజ మొదటికి విసిరింది. రంగమ్మ తలుపు దగ్గరని తాళం వేసొచ్చి బిడ్డ పక్కెమ్మటి పడుకుంది. అందరు కలిసి ఆ రాత్రి నిద్రపోయె వరకు ఆలోచించి, పట్నం వెళ్లక తప్పదు అని నిర్ణయించుకున్నారు. ఉన్న ఊరు విడవాలన్న బాధ వాళ్ళ మనసుల్లో ఓ మూల పీకుతూనే ఉంది.

మర్నాడు ఉదయమే లేచి తిరుపతయ్య ఊళ్లో తనకు బాగా సన్నిహితులైన వారికి తన నిర్ణయాన్ని తెలియజేసాడు.

ఆ పూట మూట ముల్లె సర్దుకున్నారు.

పొద్దు బారెడున్నపుడు పక్క ఊరు దూరపు బంధువులు నాగయ్య, యల్లమ్మ ఇంటికి రావడం చూసి,

"బాగున్నావా ఎల్లమొదిన" అని అడుగుతు కాళ్లకు నీళ్లిచ్చింది రంగమ్మ.

ఆ తరువాత ఆమె భర్త ఎల్లయ్యకు చెంబు అందిస్తు "ఎన్ని రోజులకు కాళ్లొచ్చినయి అన్న" అంది రంగమ్మ.

"అందరం మంచిగుంటె ఎన్నడో ఓ నాడు కలుసుకోమా" అంటు కాళ్ళు చేతులు కడుక్కుని తిరుపతయ్య మంచాన్ని వాల్చగ కూర్చున్నాడు ఎల్లయ్య.

"సుశీల లేదు" అని అడిగింది ఎల్లమ్మ.

"కట్టెపుల్లలకు పోయింది" అంది రంగమ్మ.

"మరి పిల్లనడగడానికి వచ్చినం" అంది ఎల్లమ్మ

ఓసారి మౌనంగ తన భర్త వైపు చూసి

"ఇప్పుడు పెళ్ళి చేసే స్థితిలో లేం వొదిన" అంది రంగమ్మ.

"ఏం పెట్టకు, పిల్లనిస్తే చాలు" అంది ఎల్లమ్మ.

"కాలం ఇట్ల వుంటే ఏం పెండ్లి చేస్తం చెల్లే" అన్నాడు తిరుపతయ్య.

"అయితే మేం నడుస్తం" అన్నాడు ఎల్లయ్య.

"ఈ రాత్రి ఉండి రేపు పోదురులే" అంది రంగమ్మ.

"లేదొదిన బర్రె పాలు పిండాలి. ఒక్కరోజు వొదిలితె మళ్ళి ఇవ్వదు" వస్తం అంటూ లేచింది. ఆమెతోపాటు ఎల్లయ్య లేచాడు. ఆకిలి చివరిదాక వెళ్లి ఇద్దరిని సాగనంపారు.

అప్పుడు గుర్తొచ్చింది సుశీల పెండ్లీడుకొచ్చిందని, ఈ ఊళ్లో ఉంటే ఆ పెండ్లి కాదు. పట్నం పోయి నలుగురం కష్టపడి పదో పరకో వెనకేసి పిల్లల పెండ్లి చేయాలి. అనుకుంటు చుట్టాలను సాగనంపి వస్తున్న భార్యతో "మూట ముల్లె సర్ది వుంచు నేనట్ల ఊల్లెకల్ల పోయి వస్త" అంటూ తిరుపతయ్య

బయటికి నడిచాడు.

మరునాడు పొద్దు పొడిచి ఎండెక్కుతుంది భార్య భర్తలు బస్సెక్కి కూర్చున్నారు. కొడుకు బిడ్డ వెనక సీట్లలో కూర్చున్నారు. బస్సు నడుస్తూ వుంది. తిరుపతయ్య తలలో తను పుట్టి పెరిగిన ఊరు కదులుతూవుంది. చిన్నప్పుడు తాను తిరిగిన చెలుకలు, పచ్చని చేలతో పలు రకాల పంటలతో ఎటు చూసిన కండ్ల సంబూరంగా వుండేది. చిన్నప్పుడు తాను తిరిగిన వాగులు డొంకలు గుర్తొచ్చాయి. వాగుల్లో పరకపిల్ల పట్టింది. ఎనుగుల్లో దారి బొంతులను కొట్టింది. ఏ నేలపొంటి సీతాఫల కాయలను తెంపుకొని కాల్చుక తిన్నది సీమసింతకాయలు, పచ్చ జొన్నలు తిన్నది గుర్తొచ్చింది. ఎర్రటి ఎండల్లో చెలిమనీళ్ళు ఎంత చల్లగావుండేవో! ఈ ఊరెకద నడక నేర్పింది, మాటలు నేర్పింది. ఈనాడు కన్నతల్లిలాంటి, ఈ ఊరు వదిలి వెళ్ళవలసి వచ్చింది. తిరుపతయ్య ఎదలో నుండి ఏదో బాద సుడులు సుడులుగా పైకొచ్చి కన్నీళ్ళు చిమ్మాయి. కళ్ళనీరు తుడుచుకొని కాస్త కదిలి కూర్చున్నాడు.

తల చుట్టు కొంగు కప్పుకొని రంగమ్మ గతాన్ని నెమరేసుకుంటుంది. తాను కొత్త కోడలుగా ఈ వూరొచ్చింది. గనుకుని తల్లె పోయినోళ్లు పోగ ఓ కొడుకు ఓ బిడ్డను కంటిరెప్పల్లాగ కాపాడుకుంది. భార్య భర్తలిద్దరు రైతు కూలీలుగ బతుకుతు వచ్చారు. పొలం పనులు తప్ప మరోపని తెలియదు. పట్నంలో ఇక నుండి ఏంపని చేయాలో ఒక వైపు రోజు రోజుకు నరాలలో బలం తగ్గిపోతువున్నది.

బస్సు మలక్‌పేట చౌరస్తాలో ఆగింది. కండక్టర్ అదేమాట అనగానే తిరుపతయ్య ఆయనను చూసి భార్య ఆ తరువాత రాములు, సుశీల దిగారు. బస్సు తన దారిన అది కదిలిపోయింది. వీళ్లు నలుగురు ముందుకు నడిచి చుట్టు చూసారు. పరుగెత్తె బండ్లు, ఒకరినొకరు పట్టించుకోని నడకలు. "ఓ పండుగకు ఇక్కన్నె రూపాయికో అంగి అమ్మింది" అని రాములు తండ్రికి చెపుతు నడుస్తున్నారు. అగ్గిపెట్టెలు పేర్చినట్లు భవంతులు, వాటి కింది బాగాన రకరకాల దుకాణాలు ఎవరిపని వారిదే. అంతా అయోమయపు మాయ బజారులాగా వుంది. మరో చౌరస్తాను దాటి మురికి కాలువ వెంట నడిచి మలక్‌పేట గుడిసెల్లో ఉంటున్న తనకు తెలిసిన ఇంటికి తీసుకెళ్ళాడు తిరుపతయ్య. గతంలో పట్నం ఏదన్న పనిమీద వస్తే అదే బస్తిలో వున్న తన దూరపు బంధువు గుడిసెలో వుండిపోయెవాడు. మురికి కాలువ పక్కమ్మటి చిన్న చిన్న ఇండ్లు. వాటిముందు నుండి రిక్షాలు మాత్రమే నడవగల చిన్న

సందులు. అక్కడక్కడ కుక్కలు పడుకొని వున్నాయి. కాని ఆ బస్తీలో ఒకప్పటి గుడిసెలు ఇప్పుడు లేవు. గవర్నమెంటు వాళ్ళు వాళ్ళకు ఒక్కొక్క గది. దాని పక్కమ్మటి వంటకోసం రెండు రేకుల వసారాను కట్టించి ఇచ్చారు.

తన బంధువులొచ్చేది చూసి ఎదురెళ్లి క్షేమ సమాచారాలు అడిగి చేతిలోని సంచిని తీసుకొని దర్వాజ దగ్గర్కి వెళ్లి "ఏమే మన తిరుపతయ్యా, రంగమ్మ వాళ్ళు వచ్చారు కాళ్లకు నీళ్లీయ్" అన్నాడు అది విన్న రాజమ్మ నీళ్ల సర్వతో వచ్చి, వాకిలి చివరనవున్న జాలారు వరకు ముందు నడిచి, రంగమ్మకు నీళ్ల సర్వ అందించింది. నలుగురు కాళ్లు చేతులు కడుక్కొని వచ్చి ఇదుపున పరిచిన ప్లాస్టిక్ చాప మీద కూర్చున్నారు. రంగమ్మ పొయ్యి దగ్గరున్న రాజమ్మ దగ్గర్కి వెళ్లి కూర్చుంది.

"చెప్పొదిన, ఊర్లల్ల ఎట్లుంది కాలం" అని అడిగింది.

"ఏముందొదిన ఉన్న వాళ్ల సంగతి ఎక్కడైన ఒక్కటే లేనోళ్లకే వచ్చింది సావు. గంజి గటక కరువైంది. కొంత వరిపంట తప్ప గట్టి గింజలకొచ్చింది ఎట్ట. రెండు మూడు ఏండ్లనుండి వానలు పడక బోర్లు వేసిరి, అవి కొన్నాళ్ళు పారినయి. కాని బావులు అడుగంటిపాయె. ఈ ఏడు పసులకు తాపడానికి కూడ నీళ్లు కరువాయే కనీసం కూరగాయలు లేవు. ఆకు కూరలు లేవు. చివరికి గింత చిగురుగూడ కరువైంది. ఇంకేముంది పల్లెల్లో వర్షాలుంటేనే పంటలు. పంటలుంటేనే మనుషులకయినా పసులకైనా బతుకుగదా ఇక ఆ పంటల్లేవు. ఇక పల్లెలు పాడైపోవు? ఊరన్నపుడు చెట్టు చేమలుండేవి. చెట్లున్న వాటికి ఆకులులేవు. ఇంతెందుకు బాటమ్మటి వుండె తంగెడి చెట్లు గూడ ఎండిపోయి కనబడకుంట పోయినయి. అదేమోకాని కంపచెట్లకు లోటులేదు. ఏ చెట్లన్న పచ్చగున్నయి అంటే గయే. పడావుపడ్డ పొలాల నిండా కంపచెట్లే.

"అయి పాడుగాను వాటికి చావేలేదు. ఎక్కడ ఖాళి స్థలం వుంటె అక్కడ అవి మొలుస్తనే వుంటాయి" అంది పొయ్యిలో చెక్క పేళ్ళను కదిలిస్తు ఉంది రాజమ్మ.

0 0 0

నాగయ్య, తిరుపతయ్యను ఓ డబల్ రొట్టెల తయారి కంపెనీలో బట్టి దగ్గర పని చేయడానికి నెల జీతానికి కుదిర్చాడు. రోజు ఉదయం వెళ్లి తిరిగి సాయంత్రం పని దిగిరావాలి. జీతం నెలకు పదిహేను వందలు. పని బాగానే వుంది. పగటి పూట ఇంత రొట్టె కూడ దొరుకుతుంది. తిరుపతయ్య కుటుంబం నాగయ్య వుండె బస్తీలోనె ఓ గది కిరాయికి తీసుకొని ఉంటువున్నారు. కొన్ని

రోజుల్లో ఊరు విడిచి వచ్చిన బాధ మరిచిపోయి పట్టణపు బతుకుకు అలవాటు పడిపోయారు. కాని నల్లనీళ్ల దగ్గర దొడ్డికి పోయె చోట లైన్‌లో నిలబడడం అలవాటులేని అవసరం. మొదట కొన్ని రోజులు ఇబ్బంది అయ్యింది.

బొమ్మిడి చేపల కూర, ఎర్రపప్పుచారు, సింతపండు చట్నీ అలవాటైపోయింది. తోటకూర, పాలకూర చాల మంచి కూరలన్నమాట. గుడ్లు వండుకుంటె కొన్ని కోసుకున్నట్టె. టమాటాలు, వంకాయలు ఎక్కువ వాడకాలు. పెద్దపెద్ద కుండల్లో పెరుగు తెచ్చి ఇల్లిల్లు తిరిగి అమ్మటం మామూలె. ఏ నొప్పి జ్వరం వచ్చినా జిందాతిలిస్మాత్, జండూబామ్‌లే మందులు.

మరునాడు రాములును తీసుకెళ్లి ఓ సాయెబ్ దగ్గర ట్రాన్సుపోర్ట్ ఏజెన్సీలో హమాలిగ కుదిర్చాడు. వచ్చిన లారిలోని సామాను దించుకొని గోదాములో భద్రపరచుకోవాలి. అట్లాగె ప్యాసింజర్ లేదా దుకాణాదార్లు ఎల్‌ఆర్‌లు తెచ్చిస్తే వాళ్ల వాళ్ల సామానులు వాళ్లకివ్వాలి. గోదామునుండి దుకాణాలకు రిక్షాలలో చేర్చి వచ్చే రిక్షావాళ్ళు వేరే వుంటారు. రాములు గోదాము దగ్గరె వుంటాడు. పని బాగానె వుంది. రాములు ఉదయం వెళ్లి రాత్రికి వస్తుంటాడు. మధ్యాహ్నానికి లంచ్‌బాక్సు తీసుకెళుతువుంటారు. కూలిగూడ మంచి గిట్టుబాటుగానే వుంది.

పోతె రాజమ్మ తాను వెళ్లె ఉప్పరి పనికి సుశీలను, రంగమ్మను తీసుకెళుతుంది. వాళ్లకు రోజు కూలికి డోకాలేదు. కాని ఆ పని ఒక బజారున అని వుండదు. అడ్డమీదికి పోయినంక ఎక్కడ పనిసాగితె అక్కడికి మేస్త్రి రమ్మన్న చోటికి వెలుతువుండాలి. మొదట రాజమ్మ, సుశీల రంగమ్మ ఒకే చోటికి వెలుతు వుండేది. నలుగురు పనిచేస్తు వున్నారు కనుక వచ్చిన డబ్బులో కొంత ఒక చోట వేసుకుంటు మిగతా వాటితో మూడు పూటలు తింటూ వచ్చారు. రాములు కాస్త కండపోసాడు. సుశీల బాగ కుదురుకుని సాయె తేలింది. వయస్సును ఎవరు ఆపగలరు. సుశీలకు సిగలో పూలు నుదుట బొట్టు రోజు తప్పనిసరి అయ్యింది. మేస్త్రీలు తాము పట్టిన పనిదగ్గట్టు కింది పనివాళ్లను ఏరుకుంటు వుంటారు. అందువల్లా ముగ్గురు రాజమ్మ, రంగమ్మ ఒకేచోట చేయటం కుదరలేదు. సుశీల పనికెళ్లిన చోట ఓ మేస్త్రి 'సుశీల పని చెకాచెకా చేస్తుందని' మెచ్చుకుంటు రోజు తన పనిలోకె రమ్మంటు వుండేవాడు.

సుశీల కూడ చాలా హుషారుగా పనిచేస్తుండేది. ఎవరన్న బరువు మోయలేకపోతే ఓ చేయి ఆసరాగ కూడ ఇచ్చేది. పని ముగిసినాక సామానులను శుభ్రంగా కడిగి దాచి వుంచేది.

మేస్త్రి 'భలే పనిచేస్తావమ్మా' అంటూ మెచ్చుకునేవాడు.

ఇదంతా ఓ కంట కనిపెడుతువున్న ఆ అపార్ట్సను కడుతున్న రియల్ ఎస్టేట్ కాంట్రాక్టర్

"మేస్త్రీ ఏదో ఎరవేస్తున్నాడు జాగ్రత్త" అని సుశీలకు సూచన వేశాడు.

"అది అంత ఈజీ కాదు దొర. కూలీలం కావొచ్చు కాని నీతిలేనోల్లంకాదు" అంది.

"మేస్త్రీలు మాయగాళ్ళు తమ దగ్గరికి పనికొచ్చినోళ్లను పట్టక వొదలరు" అన్నాడు.

"కావొచ్చు గాని నన్ను ఏం చేయలేరు" అంటు గదిలోని తట్టపారలను తీసుకొని పని దగ్గరికి నడిచింది. మేస్త్రీ సాయంత్రం కూళ్లు ఇచ్చేటప్పుడు ఏబదికి బదులు వందనోటు ఇచ్చాడు.

మొదట పొరపాటు కావచ్చు అనుకొని సుశీల తిరిగిస్తు నాకు రావల్సింది ఏబై అంది.

మేస్త్రీ కాసేపు తటపటాయించి "వుండనీలే, చిల్లరలేదు అన్నాడు" అప్పుడతని నాలిక తడారింది.

"రేపొస్తావుగ రేపటి కూలి కింద పెట్టుకో" అన్నాడు.

"అట్లా నాకేమొద్దు, దీన్ని తీసుకొని మరో నోటు ఇస్తు వుంటె అతని చేతులు వనికాయి.

పని బాగ చేస్తుంది అని మరునాడు సుశీలను నీళ్ళు చల్లడానికి పెట్టమని చెప్పి, మేస్త్రి కింది నుండి తప్పించాడు కాంట్రాక్టర్.

అప్పుడప్పుడు మేస్త్రి వేరే ఆడకూలీలతో పరాచికాలు ఆడడం చేస్తూనే వున్నాడు. వాళ్లు ఎవరు ఎదురు చెప్పడంలేదు పోగ నవ్వుతు వుండేవారు. తాను తప్పించుకున్నందుకు సంతోషించింది. ఈ విషయాన్ని రాజమ్మకు చెప్పితే విని విననట్టు ఉండిపోతు 'నీవు మాత్రం జాగ్రత్త' అని చెప్పింది.

మొత్తం మీద మూడు నెలలు గడిచాయి. కలిసినపుడల్లా మేస్త్రి గుర్రుగా చూస్తు వున్నాడు. అప్పటినుండి పనికి పిలవటం లేదు. కాంట్రాక్టర్ పని పూర్తయిందని పనిచేసే వాళ్లకు కొత్త బట్టలు పెట్టి, ఓ యాటను కోసి అందిరికి బోజనాలు పెట్టించాడు. సుశీలకు ఓ చీరె, రవిక ఇప్పించాడు. "రంగులేసినంకా కూడ నీళ్లు చల్లాలి నీవు వస్తూవుండు" అని సుశీలకు చెప్పాడు.

రాములు ట్రాన్స్‌పోర్టుకు పోతూనె వున్నాడు. తిరుపతయ్య రోజు తన పనికి తాను వెలుతూనే వున్నాడు. రంగమ్మకు రోజు పని దొర్కుతునెవుంది.

కాని తల్లి కోడి వెంటలేని కారణంగా కోడి పిల్లకోసం కాకులు గద్దలు పొంచి చూస్తున్నట్టు చూస్తు వున్నారు సుశీలను. సుశీల నీళ్లు చల్లడానికి రోజు వెలుతూనే వుంది.

0 0 0

ఆ రోజు సాయంత్రం తిరుపతయ్య భార్య "అమ్మాయి పెళ్లికి ఎదిగింది, కూడేసిన పైసలకు తోడుగ చిట్టి ఎత్తుకుందాం ఊరెల్లి పెళ్లి కాయం చేసుకొని వస్తాను. ఎండకాలంలో చేద్దాం. అప్పుడె మనం వచ్చి రెండేండ్లయింది" అన్నాడు తిరుపతయ్య భార్యతో.

"ఊర్లలో ఏముందని ఇక్కన్నె ఓ సంబంధం చూస్తె కాదు, మళ్ళీ ఊర్ల మనువెందుకు" అంది రంగమ్మ.

"ఈ పట్నంలోనా, ఇది పేరుకే పట్నం వాస్తవానికో అడివి. ఇక్కడ చూడడానికె మనుషులు, కాని గుణాలు మాత్రం నక్కలవి, తొడేండ్లవి, పులులవి సుమా ఇధ్ధంతా మాయాజాలం ఒక్క పూట తిండి దొర్కినా ఆ పల్లె తల్లెనయం. అందుకె ఊరికి ఇద్దాం ఎప్పుడు కరువే వుంటదా. ఎల్లయ్య బావోల్లను అడిగివస్త అన్నాడు.

"సరె నీ మాట ఎన్నడన్న కాదన్ననా" అంది రంగమ్మ. ఆ రోజె ఊరికి ప్రయాణమైనాడు తిరుపతయ్య.

సుశీల రంగులు వేసిన గోడలకు నీళ్ళు చల్లడానికి వెళ్ళి నీళ్ళు చల్లుతూవుంది. కంట్రాక్టర్ వచ్చి ఓసారి అంత కలియచూసాడు. మధ్యాహ్నం వాచ్‌మెన్‌ను పిలిచి "రెండు తమ్‌సప్‌లు తేపో" అన్నాడు. తెచ్చి మూతలు తీసాడు. "ఓటి సుశీలకీయి" అంటు తానొకటి తీసుకున్నాడు.

మొదట సుశీల "వద్దంది, అలవాటు లేదు" అంది.

"ఏదైనా ఓ సారి మొదలు పెడితేనె కదా అలవాటు అయ్యేది" అన్నాడు.

"అరె తాగమ్మ తాగు, ఎండలు బాగున్నయ్".

"నాకు అలవాటు లేదు దొర" అంది మళ్లీ.

మరి మరి అన్నందుకు బలవంతంగా తాగింది. కాస్త ప్రాణం చల్లబడ్డట్టు అనిపించింది. కంట్రాక్టర్ రోజు తమ్‌సప్ తాగిస్తూనే వున్నాడు.

ఓ రోజు తమ్‌సప్ తాగగానే కళ్ళు తిరిగినట్టు అనిపించింది సుశీలకు. అదే విషయం కంట్రాక్టర్‌తో చెప్పింది.

"పొద్దున అన్నం తిని వచ్చావా?" అడిగాడు.

"తినొచ్చిన అంటు" కళ్ళు నలుపుకుంటూ వెళ్ళి కూజాలోని నీళ్ళు ముఖం

మీద చల్లుకుంది.

"కళ్ళు బాగా తిరుగుతున్నాయి దొర" అంది.

"ఎంకన్న ఓ ఎంకన్న" అని వాచ్‌మెన్‌ను పిలిచింది.

"వాడు ఖాళీ సీసాలు ఇచ్చిరావడానికి వెళ్లిండు" అన్నాడు.

"ఓ అమ్మో ఎందుకిట్ల కండ్లు మూసుకపోతున్నాయి" అంటూ వణుకుతూ కొన్ని నీళ్ళు తాగింది.

"అయితే అట్లా మంచంమీద వొరుగుమరి" అంటూ ఫ్యాన్ ఎక్కువ చేసాడు.

అసలు విషయం గ్రహించిన సుశీల కూజాతో అతని ముఖం మీద కొట్టి పారిపోయి ఇల్లు చేరింది. ఇంట్లో ఉన్న నాగమ్మ సుశీలను చూసి "ఏమిటి అదోలాగ ఉన్నావు" అని అడిగింది.

సుశీల జరిగిన విషయం చెప్పింది.

"నేను ముందే చెప్పాను జాగ్రత్తగా ఉండమని నీకు రోజు కూల్ డ్రింక్స్ తాగిస్తున్నాడంటే ఊకె తాగిస్తారా? ఈడోచ్చిన పిల్లవు గామాత్రం అర్థం చేసుకోలేవు, అసలు మొదటి రోజే తాగాల్సి లేకుండే, ఆ రోజే తాగకుండా ఉంటే ఈ కథ ఇందాకా రాకపోవు అయినా మంచిపని చేశావు ఇక ఈ విషయం ఎవరితోను ఎత్తకు" అంది.

0 0 0

తిరుపతయ్య మరునాడు తిరిగొచ్చాడు.

"కాయా, పండా" అని అడిగింది.

"పండే అన్నాడు. లగ్గం పెట్టుకోవడానికి కూడ రమ్మన్నారు" అన్నాడు.

"నాతల్లె" అంతె మరి కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగదట" అంది రంగమ్మ.

"పిల్ల పెద్ద మనిషయ్యింది, పెండ్లి కుదిరింది సంతోషం" అంది వారం రోజుల తరువాత అందరు ఊరెళ్లి లగ్గం పెట్టుకున్నారు. పెళ్లి జరిగిపోయింది. సుశీల అత్తవారింటికి వెళ్లిపోయింది. అడవిలోనుండి సుశీల ఊరు చేరింది. పెళ్లి అయిన పదహారొద్దుల పండగ తరువాత తిరిగి ముగ్గురు పట్నం చేరారు. కూతురు పెళ్లికి చేసిన అప్పులు తీర్చాలి కనక రాకతప్పలేదు. వచ్చారు.

రాములు ట్రాన్సుపోర్టులో బాగ పనిచేయడం వల్ల సేటుకు చాలా దగ్గర అయినాడు. కొంచెం కూలి ఎక్కువ ఇస్తు తన సొంత పనులు కూడ చేయించుకునేవాడు. ఎక్కడికన్న పనికి పంపినపుడు తన స్కూటర్‌ను ఇస్తుండేవాడు. సేటుకు రాములు తలలోని నాలుకైనాడు. నమ్మినబంటు

అయినాడు. అతను పట్టణమంతా తిరిగి పనులు చేసుకోవడానికి ఓ సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనిచ్చాడు. దోతి షర్ట్ పోయి ప్యాంట్ షర్ట్‌లోకి మారాడు. తాముంటున్న బస్తిలోని వాళ్ల ఒక్కరిద్దరు పిల్లనిస్తమని కూడ వచ్చిపోతువున్నారు.

"పిల్లవాని పెళ్లి కూడా చేయవలసిందే" అంది రంగమ్మ తిరుపతయ్యతో.

"చేద్దాం చేద్దాం మొన్ననే ఓ పెండ్లాయే" అన్నాడు కాని త్వరలో చేయాలని వుంది అయన మనస్సులోగూడ.

"మనం పెట్టేదేముంది. మొగపిల్లవాని పెండ్లి అంతా వాళ్లె సూసుకుంటారు" అంది.

ఓ రోజు పొద్దున్నె బస్తిలోని జనం వాకిళ్లు ఊడుచుకుంటు "తెల్లవారుజామున రాములను పోలీసులు పట్టుకపోయింద్రు" అంది పక్కింటి ఆవిడ.

"ఎందుకో" అంది మరో ఆవిడ కిరాణ కొట్టుకు వెళ్లి వస్తూ.

"తల్లి-తండ్రి ఇప్పుడే పోలీసు స్టేషన్‌కు వెళ్లింద్రు. తల్లి ఒక్కటే ఏడుచుడు. మన నాగయ్య గిట్లపోయిందు మరేమాయెనో" అంది రాజమ్మ.

నీతో ఎవరు ఈ పని చేయిస్తున్నారు" అని అడిగాడు ఎస్.ఐ.

రాములు చెప్పలేదు. లాటి వంటిపై పడ్డా గూడ చెప్పలేదు.

పోలీసు లాకప్‌లో ఎన్నాళ్ళు చెప్పకుంటా వుంటారు. వాళ్లు పెట్టె హింసను భరించలేక చెప్పినాడు.

సేట్‌ను అరెస్ట్ చేసారు. గోదాములో సరుకు స్వాదీనం చేసుకున్నారు.

"ఏయ్ రాములు మీ సేటు నీతో ఏం పనిచేయించాడో నీకు తెలుసా" అని అడిగాడు ఎస్.ఐ.

"తెలియదు దొర. నింపిన అగ్గిపెట్టెలు ఇచ్చి పలాన చోట ఇచ్చిరమ్మంటె ఇచ్చి వచ్చేది అంతే" చేతులు జోడిస్తూ అమాయకంగ అన్నాడు.

"ఎప్పుడన్న విప్పి చూసినవా" అన్నాడు ఎస్.ఐ.

"లేదు దొర. అదేందో నాకు తెలవదు"

"అది గంజాయిర గాడిదకొడకా"

"నాకు అసలే తెలియదు" అన్నాడు ఆ విషయం అతని చూపులో మాటలో తెలుస్తూనే వుంది.

మొత్తం మీద నాగయ్య ప్రయత్నంతో ఓ స్థానిక నాయకుని జామీను మీద వొదిలిపెట్టారు. పెళ్లి అప్పుతో పాటు రాములును బయటకు తేవడానికి సేటు ఎంత పెట్టుకున్న కొంత తిరుపతయ్యకు ఖర్చయింది. ఒక రోజు సేటు

ఇంటికెళ్లి తనతో ఆ పనిచేయించినందుకు తగాదా పడ్డాడు. తనకేమి తెలియదు "ఊర్కెనె కేసు బనాయించి నన్ను అరెస్ట్ చేసారు. డబ్బు తిన్నరు. నేనెవరికి చెప్పుకోవాలి" అన్నాడు.

ఆరోజు పొద్దుగూకంగా అందరు ఇల్లు చేరారు. తిరుపతయ్య నాగయ్యను పిలిచి రాములు సంగతి చర్చించారు. వాని పనిలోకి "వెళ్లొద్దని" నిర్ణయించారు.

మరునాడు రాములు పనికి వెళ్ళలేదు. అతను ఇప్పిచ్చిన స్కూటర్ తన దగ్గరె వుంచుకున్నాడు.

తిరుపతయ్య కొడుకు మాయ చిక్కుల్లో చిక్కుకున్నందుకు బాదపడ్డాడు. దండగలకైన అప్పు ఎప్పుడు తీరాలి. అని ఆలోచిస్తూ బట్టిలోని నిప్పును కదలించబోయి పరధ్యాన్నంలో పైన వున్న డెకీచా మూతను లేపాడు. ఒక్కసారె సలసల కాగే నీళ్ళు మీద పడి చేతుల మీద, ముఖం మీద పడి బొగ్గలొచ్చినయి. దవాఖానలో చేర్పించారు. బాగు కావటానికి పదిహేను రోజులు పట్టినయి. కార్ఖాణ సేటు ఖర్చులు భరించాడు. కార్మిక చట్ట ప్రకారంగా జీతం పోను కొంత డబ్బు ఇప్పించారు.

అదే రోజు సాయంత్రం తండ్రి, తల్లి రాములు ముగ్గురు కూర్చోని 'ఊరికి వెళ్లిపోదాం' అ పట్నం బతుకులు మనకొద్దు అనుకున్నారు.

ఉదయమే నాగయ్య ఊరెళ్లిపోతానన్న తిరుపతయ్యతో మాట్లాడదానికి వచ్చాడు అదే విషయం తిరుపతయ్యతో అడుగుతూ, "బతుకన్నాక బాదలు తప్పవు. వాటిని ఎదుర్కోవడంలోనే వుంది జీవితం ఇంకేదన్నా పని గూర్చి ఆలోచిద్దాం. ఇంకా పనుల్లేవా" అన్నాడు నాగయ్య. ఆయన ముప్పదేండ్ల నుండి నగరంలోనే వుంటున్నాడు. ఎందరి బతుకులనో చూస్తూ వస్తున్నాడో, నగరం నాడి తెలుసు.

"ఏ పనిచేసినా ఏదో ఓ మోసం, దగా మా సేటుగాడు చూడు నా తోటి గంజాయి అమ్మిచ్చిండు" అన్నాడు.

"గా సంగతి వదిలేయి. మీ నాయనకు డబల్ రొట్టె చేసేది తెలుసు, నీకు దకాణాలన్ని తెలుసు. మొన్నవాడిచ్చిన డబ్బుంది నేను కొంత అప్పు ఇప్పిస్తా మీరె డబుల్ రొట్టెల ఖార్కాన పెడితే పోలె" అని సలహా ఇచ్చాడు నాగయ్య.

ఆ సలహా రాములుకు నచ్చింది.

ఇక ఊరికి తిరిగి వెళ్లాలన్న ఆలోచన మానుకున్నారు.